క్లుప్తంగా

సిద్ధలయ్య స్వామి తిరునాళ్లు ప్రారంభం



సిద్ధలయ్య స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో ఉన్న సిద్ధలయ్య కోనలో తిరునాళ్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇక్కడ శ్రీనవకోటి, నవనాథుల సిద్ధలయ్యతో పాటు వారి ప్రియశిష్యుడు సారంగధర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ, కాలసర్ప, రాహుకేతు దోష నివారణ పూజలు చేశారు. భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ దర్శించుకున్నారు.

స్కంధ షష్టి మహోత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్ల నగరోత్సవం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్కంధ షష్టి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు గణపతి హోమం చేసి ధ్వజారోహణ చేపట్టారు. ముందుగా వల్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు చేశారు. సాయంత్రం వేదపారాయణం, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్ట నిర్వహించారు. రాత్రి స్వామి వారి నగరోత్సవం చేపట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ, ఆలయ గౌరవాధ్యక్షుడు రవికుమార్ శర్మ, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు,

ఘనంగా ముత్తుమారియమ్మ ఆలయ కుంభాభిషేకం

పెళ్లకూరు : మండల కేంద్రమైన పెళ్లకూరులో నిర్మించిన ముత్తుమారియమ్మ ఆలయం కుంభాభిషేక మహోత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంతోపాటు గ్రామంలోని ప్రధాన వీధులను విద్యుత్ దీ పాలు, మామిడితోరణాలతో అలంకరించారు. గ్రా మానికి చెందిన హృషీకేశవరావు, శ్రీలక్ష్మీ దంపతుల ఆద్వర్యంలో మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

విశ్రాంత హెచ్‌ఎంకు సన్మానం



విశ్రాంత హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎంఈవోలు శ్రీనివాసులు, జిలానీ

రాపూరు: మండలంలోని పంగిలి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ అక్టోబర్ 30న ఉద్యోగ విరమణ చేసిన పాయసం చంద్రశేఖర్ సేవలు అభినందనీయమని ఎంఈవోలు శ్రీనివాసులు, జిలానీ తెలిపారు. స్థానిక షాదీ మందిర్‌లో సోమవారం చంద్రశేఖరయ్య దంపతులను ఘనంగా సన్మానించారు.

కండలేరులో 47.451 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 47.451 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9,650 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1,380, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

ఓజిలి: మండలంలోని కర్రబల్లవోలు గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వెంకటాంబ ఆరాధనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

8న ఏడు గంగమ్మల ఆలయ మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ముత్యాలమ్మ ఆలయ వీధిలో ఉన్న ఏడుగుంగమ్మల ఆలయానికి 8వ తేదీ శుక్రవారం మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు పూజా కార్యక్రమాలు, 8వ తేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు.

చిక్కని చేప



చేపలు దొరక్క నిరాశతో వెనుతిరిగి వస్తున్న మత్స్యకారుడు

సముద్రంలో చేపల వేటే వారికి జీవనాధారం. చేపలు దొరికితేనే పూట గడుస్తుంది. లేకుంటే పస్తులు ఉండాల్సిందే. నాలుగు నెలలుగా ప్రతికూల వాతావరణం నెలకొనడంతో వేట సాగడం లేదు. ఆశతో సముద్రంలోకి వెళ్లినా గాలానికి చేపలు చిక్కడం లేదు. పూట గడవక గంగపుత్రులు పస్తులు ఉంటున్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. వేట విరామ సమయంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు ఇచ్చేదని, ఈ ప్రభుత్వం కనీసం తమ గురించి పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

- నాలుగు నెలలుగా గడ్డు పరిస్థితి
- పతికూల వాతావరణం వల్లేనంటున్న మత్స్యకారులు
- పూటగడవక ఇబ్బందులు పడుతున్న గంగపుత్రులు
- సాయం అందించకుండా మీనమేషాలు లెక్కిస్తున్న ప్రభుత్వం

వాకాడు : తిరుపతి జిల్లాలోని వాకాడు, కోట, చిల్లకూరు, తడ మండలాల్లో 76 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరం వ్యాపించి ఉంది. అందులో 39 మత్స్యకార గ్రామాలు, 2020 బోట్లు ఉన్నాయి. 4878 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరు సముద్రంలో చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాధారణంగా వేట విరామం తర్వాత సముద్రంలో చేపలు ఎక్కువగా దొరుకుతాయి. ఈ ఏడాది నాలుగు నెలలుగా చేపలు దొరకడం లేదు. ఇందుకు వాతావరణం సక్రమంగా లేకపోవడంతో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. సాధారణ రోజుల్లో సైతం హోరుగాలి వీస్తుండడంతో బోట్లు ఒక్కచోట నిలవడం లేదు. దీంతో ఉన్న కాస్త మత్స్య సంపద చెల్లా చెదురవుతున్నాయి. పొద్దస్తమానం గాలించినా ఒక్క చేప కూడా దొరకడం లేదు. శ్రమతోపాటు, డీజిల్ ఖర్చులు పెరిగి మత్స్యకారులు నిరాశతో వెనుతిరిగి వచ్చేస్తున్నారు. ఒకప్పుడు ఎక్కువగా మత్స్య సంపద దొరికి సంతోషంతో కనిపించిన గంగపుత్రులు నేడు చేపలు దొరక్క పూట గడవక ఆకలితో అలమటిస్తున్నారు. కొందరు మత్స్యకారులు ఏమిచేయాలో తెలియక దినసరి కూలీలుగా మారుతున్నారు.



తూపిలిపాళెం వద్ద నాలుగు నెలలుగా ఒడ్డున నిలిచిన బోట్లు

వ్యర్థ జలాలతో నశిస్తున్న చేపలు

చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం, వరగలి, మీనాక్షీ, సింహపురి, థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే వ్యర్థ జలాలను కండలేరు క్రీకులోకి వదులుతున్నారు. అవి అక్కడి నుంచి సముద్రంలో కలుస్తుండడంతో తీర ప్రాంతాల్లో చేపలు నశించి పోతున్నాయి. వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు.

అందని వేట విరామ భృతి

ప్రతిఏటా జూన్ నెలలో ప్రభుత్వం వేట విరామ భృతి ఇస్తుంది. దాంతో గంగపుత్రులు జీవనం సాగించేవారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి ఏటా క్రమంతప్పకుండా రూ.10 వేలను అందజేసింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం విరామ సమయం ముగిసి నాలుగు నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. తామొస్తే రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు చెప్పారని, ఇప్పుడు ఆ విషయం గురించి పట్టించుకోకపోవడం దారుణమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క చేప కూడా దొరకడంలేదు



సముద్రంలో చేపలు దొరికి నాలుగు కావస్తోంది. ప్రతికూల వాతావరణం కారణంగా సముద్రంపై హోరుగాలి వీస్తుండడంతో పడవలు నిలవడం లేదు. తెల్లవారుజామున సముద్రంలోకి వెళ్లినప్పటికీ బోట్లు ఒక్కచోట నిలవక, చేపదొరక్క నిరాశతో వెనుతిరిగి రావాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. జీవనం కష్టంగా ఉంది.

\- కృష్ణ, మత్స్యకారుడు, తూపిలిపాళెం

పస్తులతో గడుపుతున్నాము



గతంలో చేపలు బాగా దొరికేవి. హాయిగా జీవించే వాళ్లం. ఇప్పుడు ఒక్క చేప కూడా దొరకడం లేదు. పస్తులతో గడపాల్సి వస్తోంది. ప్రభుత్వం వేట విరామ సాయం ఇవ్వలేదు. అధికారులను అడిగితే కుంటి సాకులు చెప్పి మాట దాటేస్తున్నారు. చేపల వేట లేక, పూట గడవక పస్తులుంటున్నాం. ఈ విషయం తెలిసినా నాయకులు పట్టించుకోవడం లేదు.

\- సోమయ్య, మత్స్యకారుడు, తూపిలిపాళెం



ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు



తూపిలిపాళెం బీచ్ వద్ద కూర్చుని తమ జీవనంపై చర్చించుకుంటున్న మత్స్యకారులు

పేదలకు భూములు పంపిణీ చేయాలి

గూడూరు రూరల్ : ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చిట్టమూరు మండలం పిట్టివానిపల్లిలో సర్వే నంబర్-1లో సుమారు 12 నుంచి 30 ఎకరాలు, 36లో 8 ఎకరాలు, 41లో 13 ఎకరాల భూమిని ఎన్నో ఏళ్ల క్రితం చిట్టమూరు, వాకాడు మండలాల్లోని పేదలకు పంపిణీ చేశారని తెలిపారు. రెండు మండలాల రైతుల మధ్య వివాదం నడుస్తుండగా కొంతమంది అధికారులు పెత్తందారులకు పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారని తెలిపారు. నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు, రైతుల మధ్య వివాదం నెలకొని ఘర్షణలకు దారి తీస్తున్నట్టు వివరించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులైన రైతులకు భూములు పంపిణీ చేయాలని కోరారు. అలాగే పిట్టివానిపల్లిలో సుమారు 100 ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వర రావు, నాయకులు బాలక్రిష్ణ, దయాకర్, రమణయ్య పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో అధ్యాపకులకు శిక్షణా తరగతులు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సోమవారం ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సౌజన్యంతో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. తిరుపతి ఐఐటీ మెకానికల్ విభాగం హెచ్‌వోడీ రవిశంకర్ హాజరై శిక్షణ ఇచ్చారు. చెన్నై ఐఐటీ ప్రొఫెసర్ శివశ్రీనివాసులు మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఉన్న విస్తృత అవకాశాలు, పరిశోధనలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వివరించారు. కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణా తరగతులు ఆరు రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

మెనూ చార్జీలు పెంచాలని వినతి

ఓజిలి: మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద కోరారు. ఆయన సోమవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో కలిసి ఎంఈవో శైలజకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ భోజన నిర్వాహకులు పాఠశాలల్లో వెట్టిచాకిరీ చేస్తున్నారని తెలిపారు. విద్యార్థికి రూ.20 చొప్పున మెనూ చార్జీలను పెంచాలన్నారు.

వ్యర్థాలతో చెరువుల్లో నీరు కలుషితం



ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు

చిల్లకూరు : క్రిష్ణపట్నం పోర్టు నుంచి విడుదలయ్యే వ్యర్థాలను కడివేడు, తిమ్మనగారిపాళెం, గుత్తావారిపాళెంలోని చెరువుల్లోకి వదులుతుండడంతో నీరు కలుషితమై పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతు సంఘం నాయకులు వాపోయారు. వారు సోమవారం రైతులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ క్రిష్ణపట్నం పోర్టు నుంచి విడుదలవుతున్న వ్యర్థాలను చెరువుల్లోకి వదులుతున్నారని తెలిపారు. గతంలో ఆయిల్ వ్యర్థాలు వదలడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆరోపించారు. ప్రస్తుతం మళ్లీ వ్యర్థాలను చెరువులో వదలడంతో నీరు కలుషితమైందని, పశువులు మృతి చెందుతున్నాయని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతి పత్రం అందజేశారు. చంద్రమోహన్, జోగి శివకుమార్, అరుణమ్మ, హేమలత, సురేష్, ప్రసాద్, బీవీ రమణయ్య, చంద్రయ్య, రైతులు ఎల్‌ఎంటీ ప్రసాద్, గజేంద్రనాయుడు, రాధాక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నాయుడుపేట టౌన్ : రైతులకు వరి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి జె.గణేష్ హెచ్చరించారు. ఆయన సోమవారం నాయుడుపేటలోని పలు వరి విత్తనాల దుకాణాలను పరిశీలించారు. వరి విత్తనాల నిల్వలు, నాణ్యత, రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసే ప్రతి రైతుకూ తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు.

కోటలో..

కోట: మండలంలోని విత్తనాల దుకాణాలను సోమవారం ఏవో నిరంజన్‌కుమార్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ ద్వారా విత్తనాలు అందజేస్తున్నామనిన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసువస్తే బయోమెట్రిక్ ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు.

రైతులకు బిల్లులు ఇవ్వాల్సిందే..

దక్కిలి : ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాల్సిందేనని వ్యవసాయశాఖ అధికారిణి విజయభారతి తెలిపారు. ఆమె సోమవారం దక్కిలిలో ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభు త్వం నిర్దేశించిన ధరలకే విక్రయాలు చేపట్టాలన్నా రు. ధరల పట్టికను ఏర్పాటుచేయాలని సూచించారు.



నాయుడుపేటలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

వెంకటగిరి రూరల్ : ఎమ్మార్పీకి కాకుండా అధిక ధరలకు ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ నాగార్జునసాగర్ హెచ్చరించారు. ఆయన సోమవారం వెంకటగిరిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల డీలర్లు తప్పని సరిగా లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో సుజాత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



నాయుడుపేట టౌన్ : జంబుకేశ్వర స్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న మహిళలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలంకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి ఆకాశ దీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించారు. కాశీ విశ్వేశ్వరస్వామి, జంబుకేశ్వర స్వామి, దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తుమ్మూరు, పుదూరు, తిమ్మాజికండ్రిగ, జువ్వలపాళెం తదితర గ్రామాల్లోని శివాలయాల్లోనూ కార్తీక సోమవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



రాపూరు: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

భక్తులతో కిక్కిరిసిన శివాలయం

రాపూరు: మండల కేంద్రమైన రాపూరులో ఉన్న పురాతన రామనాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. కొందరు కార్తీక నోములు నోచుకున్నారు. అదేవిధంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో సత్తాచాటిన గూడూరు చిన్నారులు



కప్పు సాధించిన ఇద్దరు చిన్నారులు

చిల్లకూరు : ఓపెన్ షటిల్ క్రీడా పోటీల్లో గూడూరుకు చెందిన ఇద్దరు చిన్నారులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. చెన్నైలో ఆదివారం తమిళనాడు ఓపెన్ షటిల్ బాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఇందులో గూడూరు హెచ్‌డీ ఎరీనా స్టేడియంలో శిక్షణ పొందుతున్న షాహీర్ అండర్ -15 విభాగంలో, యశ్విన్ అండర్-9, అండర్ -11 విభాగాల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచి కప్పు సాధించారు. వారిని కోచ్ హర్షవర్ధన్ రెడ్డి, స్టేడియం నిర్వాహకులు, గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేసన్ సభ్యులు అభినందించారు.

అక్రమ లేఅవుట్‌ను పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి

దక్కిలి : మండలంలోని వెంకటగిరి-రాపూరు జాతీయ రహదారిలో లింగసముద్రం వద్ద సర్వే నంబరు 167, 175, 176, 177, 180లలో అనుమతి లేకుండా లే అవుట్‌ను ఏర్పాటుచేశారు. పంచాయతీ అనుమతులు పొందకపోవడంపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి సోమవారం పరిశీలించారు. లేఅవుట్ యజమాని హరికృష్ణకు నోటీసులు జారీచేశారు. గ్రామ పంచాయతీ అనుమతులు పొందిన తర్వాతే లేఅవుట్ పనులు చేయాల్సి ఉందన్నారు. అనుమతులు లేకుండా పనులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేశారు.

పక్కాగా నైపుణ్య గణన వివరాలు సేకరించాలి

ఓజిలి: ప్రతి ఇంటికీ వెళ్లి నైపుణ్య గణన వివరాలను పక్కాగా సేకరించాలని డీఎల్‌డీవో జాలిరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల లోపున్న వారి నైపుణ్య గణన వివరాలను సేకరించాలన్నారు. ఇందులో 85 అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను బుక్‌లెట్‌లో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో వాహనాల తనిఖీ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ పారిశ్రామికవాడలో సోమవారం పుత్తూరు ఎంవీఐ (మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) చంద్రశేఖర్ వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ లైసెన్స్, తరలించే సరుకులకు జీఎస్టీ వివరాలను పరిశీలించారు. ఈ మేరకు 43 కేసులు నమోదు చేసి రూ.4.39లక్షలు వరకు జరిమానాలు విధించారు. అలాగే వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ నేతలతో నేదురుమల్లి సమావేశం



నేతలతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు : వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సోమవారం వాకాడు మండలానికి చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక విషయాలను చర్చించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కూటమి నేతల అరాచకాలు, అక్రమా లు, దౌర్జన్యాలపై కార్యకర్తలు రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే మనకు మంచి రోజులు రానున్నాయని, అధైర్య పడొద్దని ఆయన నేతలకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ రౌతు రామకృష్ణ, నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, మధురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

గూడూరు రూరల్ : రబీ సీజన్‌లో పంటల సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారని, వారికి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబునాయుడు రూ.20 వేల పెట్టుబడి సాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా పట్టించుకోలేదని వాపోయారు. పెట్టుబడి కోసం రైతులకు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో వేసిన పంటలకు బీమా ప్రీమియంను ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా, చంద్రయ్య, అంకయ్య, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం కలుగుర్తిపాడు శివారులో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నా పందెం రాయుళ్లపై కేసులు నమోదు చేయకుండా వదలివేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలుగుర్తిపాడు ప్రాంతంలో కోడి పందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం ఆదివారం సాయంత్రం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. 14 బైక్‌లు పట్టుకున్నారు. వాటిపై కేసులు నమోదు చేయకుండా పందెం రాయుళ్లతో బేరం కుదుర్చుకుని రెండు బైక్‌లను మాత్రమే కోర్టులో హాజరుపరిచి మిగిలిన వాటిని వదిలేసినట్లు సమాచారం. దీనిపై ఎస్‌ఐ చిన బలరామయ్య వివరణ ఇస్తూ బైక్‌లను పోలీసు స్టేషన్ వద్ద ఉంచడం ఎందుకని వారి ఆధార్ కార్డులు తీసుకుని వదిలేశామన్నారు. కోడిపందెంరాయుళ్లపై కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

భారీగా మామూళ్ల వసూలు

చిట్టమూరు పోలీసులు భారీగా మామూళ్లు తీసుకుని అక్రమార్కులు వదిలివేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగు రోజుల క్రితం 10 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వారి నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకున్నట్టు తెలిసింది. వారిలో ఇద్దరు ట్రాక్టర్ యజమానులు అధికార పార్టీ నేతకు సమాచారం ఇచ్చారు. ఆయన ఫోన్ చేయగా ఇద్దరు ట్రాక్టర్ యజమానులను స్టేసన్‌కు పిలిచి నగదు తిరిగి ఇచ్చినట్లు సమాచారం.

షార్‌లో హిందీ భాషోత్సవాలు

సూళ్లూరుపేట: సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని బ్రహ్మప్రకాష్ హాలులో సోమవారం డైమండ్ జూబ్లీ హిందీ భాషా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఏ రాజరాజన్ మాట్లాడుతూ 1949 సెప్టెంబర్ 14 నుంచి హిందీ భాషా ఉత్సవాలను జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పజ్వాల్ -2024 అనే హిందీ మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. షార్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్పేస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్

గిరిజనులకు ఆధార్ ఇప్పించండి

చిల్లకూరు : గ్రామాలకు దూరంగా జీవనం సాగిస్తున్న గిరిజనులకు ఆధార్ కార్డు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గోపి మహిళా పోలీసులను ఆదేశించారు. ఆయన సోమవారం మహిళా పోలీసులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన సర్వేలో ఏయే గ్రామంలో ఆధార్ కార్డులు లేని గిరిజనులు ఎంత మంది ఉన్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసులు మాట్లాడుతూ ఎక్కువ మందికి జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్ కార్డులు అందించడం కష్టంగా మారిందన్నారు. దీనిపై ఉన్నతాధికారుల సలహా తీసుకుని కార్యక్రమాన్ని పూర్తి చేయించాలని ఎంపీడీవో సూచించారు. పల్లె పండుగ పనులపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని పేర్కొన్నారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.